ఘనంగా కార్తీకమాస పూజలు



అలంకరణలో శివపార్వతులు

మీర్‌పేట: మీర్‌పేట శ్రీ గాయత్రి సేవా సంఘం ఆధ్వర్యంలో 23వ కార్తీకమాస విశేష పూజలను ఆదివారం ఆర్‌సీఐ రోడ్డులోని కొండానగర్‌హిల్స్ కాలనీలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి శుద్ధపల్లి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం ఉదయం 7 గంటల నుంచే శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, గోపూజ, కుంకుమార్చన, మహాలింగార్చన, చండీహోమం, పార్వతీపరమేశ్వర దివ్యలీలా కల్యాణంతో పాటు వనభోజనాలు నిర్వహించారు.

పీచర్ల వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే నివాళి

చైతన్యపురి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, టీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడు పీచర్ల వెంకటేశ్వర్‌రావుకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాళులర్పించారు. పీ అండ్ టీ కాలనీ కమ్యూనిటీ హాల్ జరిగిన పీచర్ల సంతాప సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ టీఆర్‌ఎస్ మాజీ ఇన్‌చార్జి కాచం సత్యనారాయణ , మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, నాయకులు కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు రూబీ స్టిఫెన్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసన.. దోమల బెడద!

- కబ్జాలతో కుంచించుకుపోయి మురుగు కూపంగా భైరామల్‌గూడ చెరువు
- పూర్తికాని సుందరీకరణ పనులు
- బిల్లు మంజూరు కాక మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- వ్యాధుల బారినపడుతున్న పరిసర కాలనీవాసులు



మురుగునీటి కుంటలా మారిన భైరామల్‌గూడ చెరువు

చంపాపేట: ప్రజల నీటి అవసరాలను తీర్చాల్సిన చెరువులు ప్రజాప్రతినిధులు, సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదు. కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కి శల్యమై సెప్టిక్ ట్యాంక్‌ల్లా మారి పరిసర కాలనీవాసులకు అనారోగ్యాన్ని పంచుతున్నాయి. ఇందుకు కర్మన్‌ఘాట్ పరిధిలోని భైరామల్‌గూడ చెరువు నిదర్శనంగా నిలుస్తోంది.

◆ ఒకప్పటి కర్మన్‌ఘాట్ గ్రామపంచాయతీ పరిధిలోని భైరామల్‌గూడ చెరువు 6 ఎకరాల విస్తీర్ణంతో మంచినీటితో తొణికిసలాడేది. మారుతున్న కాలానికి అనుగుణంగా నగర జనాభా, నగర విస్తీర్ణత పెరగడంతో ఆ చెరువు పరిసరాలు క్రమంగా కాంక్రీట్ జంగిల్‌గా మారాయి.

◆ దీంతో బీఎన్‌రెడ్డి, డిఫెన్స్, మాధవనగర్ వంటి ఎగువ ప్రాంతాల మీదుగా వరద నీటిని చెరువుకు మోసుకొచ్చే డొంకలు, వాగులు, పిల్ల కాలువలు కనుమరుగయ్యాయి. దీంతో చెరువుకు నీరు వచ్చే మార్గం లేక ఎండి బీడుబారిపోయింది.

◆ బీడువారిన చెరువు స్థలాన్ని కొందరు కబ్జా చేయడంతో కుంచించుకుపోయి ఆరు ఎకరాల చెరువు ఇప్పుడు 2 ఎకరాల మురుగు నీటి కుంటగా మారింది.

నత్తనడకన సుందరీకరణ పనులు

◆ భైరామల్‌గూడ చెరువు సుందరీకరణకు ఆరేళ్ల క్రితమే ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు మాత్రం నత్తనడకన సాగుతుండటంతో సమస్య ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

◆ కాంట్రాక్టర్ మురుగు, వరదనీరు చెరువులోకి చేరకుండా సరూర్‌నగర్ చెరువు వరకు ట్రంక్ లైన్ పనులు ప్రారంభించాడు. అనంతరం చెరువులో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. బిల్లులు విడుదల కాకపోవటంతో ఎక్కడి పనులు అక్కడే వదిలేశాడు.

◆ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, స్థానిక కాలనీవాసుల ఒత్తిడి మేరకు కాంట్రాక్టర్ ఏడాదిన్నర క్రితం చెరువు చుట్టూ కట్టలా మట్టి పోసి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మళ్లీ చేతులు ఎత్తేశాడు.

◆ పరిసర కాలనీవాసులు అండర్ డ్రైనేజీ నాలాలను కుంటగా మారిన చెరువు స్థలంలో వదిలివేయడమే కాకుండా మాంసం వ్యర్థాలు, చెత్తా చెదారం ఆ ప్రాంతంలో డంపింగ్ చేయడంతో చెరువు మురుగు కూపంగా మారింది.

◆ ఫలితంగా పరిసర కాలనీవాసులు పందులు, దోమల స్వైర విహారం, ముక్కుపుటాలదిరే దుర్గంధం కారణంగా అనారోగ్యం పాలవుతున్నారు.

◆ ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సర్కిల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని చెరువు స్థలాన్ని సంరక్షించి పూర్తి స్థాయిలో సుందరీకరించాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు.

దుర్గంధం నుంచి విముక్తి కల్పించాలి



భైరామల్‌గూడ చెరువు మురుగు నీటి కాసారంగా మారింది. నిత్యం వెదజల్లే దుర్గంధం, దోమల సమస్యల మధ్య జీవించాల్సి వస్తోంది. అనారోగ్యం పాలవుతామని ఆందోళన చెందుతున్నాం. వెంటనే సుందరీకరణ పనులు చేపట్టి చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

గోపాల్ ముదిరాజు, మాధవనగర్

చెరువు ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



గతంలో చెరువు సుమారు ఆరు ఎకరాల వరకు ఉండేది. కాలక్రమంలో ఆక్రమణలకు గురై రెండు ఎకరాలు మిగిలి మురుగు నీటి కుంటగా మారింది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని చెరువు స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకొని చెరువును సుందరీకరించాలి.

– ఖాదర్, చంపాపేట

మినీ ట్యాంక్ బండ్‌లా తీర్చిదిద్దాలి



రాత్రి, ఉదయం వేళల్లో పరిసర కాలనీవాసులు చెరువు ఖాళీ స్థలాన్ని చెత్త డంపింగ్ కేంద్రంగా మారుస్తున్నారు. మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. చెరువుకు అవుట్‌లెట్ ఏర్పాటు చేయడంతో పాటు కబ్జాకు గురైన చెరువు భూమిని స్వాధీనం చేసుకొని మినీ ట్యాంక్ బండ్ తరహాలో తీర్చిదిద్దాలి.

ఎరవెల్లి శివకుమార్‌చారి, కటికోనికుంట

ఎల్బీనగర్ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాగోలు నాయకులు

నాగోలు: ఎల్బీనగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగోలు డివిజన్ చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ కాలనీ చెందిన నాయకులు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సుధీర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, సమస్యలు లేని ఎల్‌బీనగర్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బద్దం నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్ ఆజాద్, రావుల రంజిత్‌గౌడ్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మాదిగల అభ్యున్నతే లక్ష్యం



పాపయ్యను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నేత బట్టు దాసురావు

మలక్‌పేట: మాదిగ, మాదిగ ఉపకులాల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తామని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అన్నారు. పాపయ్య మాదిగ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మలక్‌పేట నియోజకవర్గ నాయకులు ఆదివారం ఆయన్ను మూసారంబాగ్‌లో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నేతలు బట్టు దాసురావు, కొత్వల్‌దార్ కృష్ణ, నాయకులు గంట సుదర్శన్, పోలేపాక వెంకన్న, దేవులపల్లి వెంకన్న, బకరం యాదగిరి ఉన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య కార్తీక వనభోజనాలు



పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: ఆర్యవైశ్య సంఘం, వనస్థలిపురం ఆధ్వర్యంలో ఆదివారం సచివాలయనగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులను సత్కరించారు. సంఘం అధ్యక్షుడు తడకమళ్ల విజయ్‌కుమార్, కార్యదర్శి విట్టా వెంకటేశ్వర్లు, సంభూరి శ్రీనివాస్, వేముల జయరాములు, బోనగిరి శ్రీనివాసులు, గంగాధర్, డి.భాస్కర్, డి.వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, వెంకటస్వామి, భావన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎన్జీఓస్ కాలనీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిన నేపథ్యంలో ఆదివారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆ పథకాన్ని ప్రారంభించారు. అలాగే ఎన్జీఓస్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎంపీ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ హరిప్రియ, నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తా

ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఆదివారం అక్బర్‌బాగ్ డివిజన్‌లోని మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో రూ. 5 లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, మహాలక్ష్మి ప్రగతి పథకంలో భాగంగా మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్న ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఆరోగ్య శ్రీ పథకానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, మలక్‌పేట డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ బ్రిజునీస్సా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యామ్, ఆర్ఎంఓ మల్లికార్జునప్ప, సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ, స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్, టీఎస్‌ఆర్టీసీ నోడల్ ఆఫీసర్ హరి, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ మినాజుద్దీన్

గతంలో కంటే బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చాయి

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- బీజేపీ నేతలు సామ రంగారెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి

నాగోలు: గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చాయని, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడవద్దని, ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆదివారం బీజేపీ డివిజన్ బూత్ స్థాయి కమిటీ సభ్యులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డితో కలిసి ఆయన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ యంత్రాంగాన్ని బీఆర్‌ఎస్ నాయకులు గుప్పిట్లో పెట్టుకొని అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గానికి సంబంధం లేని వారితో దొంగ ఓట్లు తయారు చేశారని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పులు జరగకుండా ఎన్నికల్లో ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడ్డ వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి

సిట్టింగ్ డివిజన్లలో బీజేపీకి తగ్గిన ఓట్లు

చంచల్‌గూడ: మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో ఎంఐఎం హవా నడుస్తున్నా కూడా గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆ పార్టీకి గట్టి పోటీ ఇచ్చి సైదాబాద్, మూసారంబాగ్, ఐఎస్ సదన్, గౌలిపురా డివిజన్‌ల్లో బీజేపీ జెండా ఎగురవేసింది. మలక్‌పేట నియోజకవర్గంలో బల్దియా ఎన్నికల్లో బీజేపీ సైదాబాద్‌లో 10621 ఓట్లు, మూసారంబాగ్‌లో 10353 ఓట్లు సాధించగా, తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సైదాబాద్‌లో 5039 ఓట్లు, మూసారంబాగ్‌లో 5000 ఓట్లు పోలయ్యాయి. ఇక యాకుత్‌పురాలోని ఐఎస్ సదన్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి 10924 ఓట్లు, గౌలిపురాలో 15469 ఓట్లు రాగా, తాజా ఎన్నికల్లో ఆ పార్టీకి ఐఎస్ సదన్ డివిజన్‌లో 5890 ఓట్లు, గౌలిపురాలో 8850 ఓట్లు వచ్చాయి. సిట్టింగ్ కార్పొరేటర్ స్థానాల్లో బీజేపీకి 50 శాతం ఓట్లు తగ్గడంపై సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ముందు ముందు సిట్టింగ్ కార్పొరేటర్ స్థానాలను కాపాడుకోవడం కమలం పార్టీకి కష్టమవుతుందని కార్యకర్తలు అంటున్నారు.

మర్యాదపూర్వక కలయిక



సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న రాజేశ్వర్‌యాదవ్

చంచల్‌గూడ: ప్రగతి భవన్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవడం మంచి పరిణామమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. నూతన సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చడం అభినందనీయమన్నారు. బీసీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలని సీఎం కోరినట్లు తెలిపారు.

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసిన చేకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

మలక్‌పేట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ఆదివారం మలక్‌పేటకు చెందిన పలువురు నాయకులతో కలిసి రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని మంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కృష్ణ, మహేష్‌కుమార్, యాదిలాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోవాలి

- మేయర్ చిగురింత పారిజాతరెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, పీసీసీ కార్యదర్శి చిగురింత పారిజాతరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని ఆమె ప్రారంభించి స్థానిక మహిళలతో ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటైన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశారన్నారు. ఇచ్చిన ప్రతి హామీలను ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, కందుకూరు ఎంపీపీ జ్యోతి, వైస్ఎంపీపీ శమంత, తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ మధుమోహన్, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్, బాల్‌రాజ్, ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాలను గెలిచాం: పవన్‌కుమార్

నాగోలు: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తపేట డివిజన్ బీజేపీ నాయకులు తమ శక్తికి మించి పనిచేశారని, మనం గెలవకున్నా ప్రజల హృదయాలను గెలుచుకున్నమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి కొత్తపేట డివిజన్ బీజేపీ కార్యాలయంలో పార్టీ శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ కమిటీ అధ్యక్షులు, పార్టీ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్ కుమార్ హాజరై ఇటీవల జరిగిన ఎన్నికలపై సమీక్షించారు. శాసనసభ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లపై చర్చించారు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ స్థానం నుంచి సామ రంగారెడ్డి పోటీ చేయాలని, అందరూ కష్టపడి పని చేస్తే కచ్చితంగా గెలుస్తామని ఈ సందర్భంగా పలువురు నాయకులు అన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న బృందావన్ మిడోస్ కాలనీవాసులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని బృందావన్ మిడోస్ కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన బృందావన్ మిడోస్ కాలనీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆదివారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కాలనీ అధ్యక్షుడు శశికాంత్, ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌చారి, రాజు, వేణు, శివ, గోపాలకృష్ణ, ప్రభాకర్, రమణ, సురేష్, రఘుమారెడ్డి, రాఘవేందర్ పాల్గొన్నారు.

లీకేజీతో తాగునీరు రోడ్డుపాలు

పట్టించుకోని అధికారులు

నాగోలు: లీకేజీతో తాగు నీరంతా వృథాగా పోయింది. నాగోలులోని అమరావతి బార్ రెస్టారెంట్ వద్ద ఆదివారం తెల్లవారుజామున నుంచి కృష్ణా పైప్‌లైన్ లీకేజీ కావడంతో ఉప్పల్ నుంచి ఎల్‌బీనగర్ వెళ్లే రోడ్డుపై పెద్ద ఎత్తున తాగునీరు పారింది. దీంతో బీటీ రోడ్డు కొట్టుకుపోయి రహదారి గుంతలమయంగా మారడంతో ఈ రోడ్డుపై వెళ్లేవారు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఇదే ప్రాంతంలో గతంలో కూడా వాటర్ లీకేజీ అయ్యింది. తరచూ ఇక్కడ తాగునీరు లీకేజీ అవుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం నాగోలు గ్రామంలో పైప్‌లైన్ లీకేజీ అయి తాగునీరు రోడ్డు పాలైంది. జలమండలి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయడంతో కొద్ది రోజులకే సమస్య పునరావృతమవుతోందని, లీకేజీలతో లక్షల లీటర్ల నీరు వృథాగా పోతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి తాగునీరు లీకేజీలు కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నాగోలు అమరావతి బార్ వద్ద లీకేజీతో రోడ్డుపై పారుతున్న తాగునీరు

మాల మహానాడు ఎల్బీనగర్ అధ్యక్షుడిగా కాశీనాథ్



నాగోలు: ఎల్బీనగర్ నియోజకవర్గం మాల మహానాడు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాక్‌టౌన్ కాలనీకి చెందిన చింతపల్లి కాశీనాథ్‌ను నియమించారు. ఆదివారం జరిగిన సమావేశానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ముఖ్య అతిథిగా హాజరై కాశీనాథ్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగటి జోసెఫ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గాలి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేసుకుంటున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: హయత్‌నగర్‌లోని సూర్యానగర్ కాలనీలో శ్రీసాయి తేజస్విని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజలు నుంచి విశేష స్పందన లభించింది. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో వచ్చి షుగర్, బీపీ, థైరాయిడ్ తదితర వ్యాధులకు పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ గుత్తా శశిధర్‌రెడ్డి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు రాసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరం నిర్వాహకుడు జక్కి వీరస్వామి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్



పాల్గొన్న బచ్‌పన్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వనస్థలిపురం: హిల్‌కాలనీలోని బచ్‌పన్ స్కూల్‌లో బచ్‌పన్ ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ సందడిగా సాగాయి. వనస్థలిపురం, కొత్తపేట, సరూర్‌నగర్, మన్సూరాబాద్ బచ్‌పన్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు వివిధ రకాల క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ రీజినల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, విద్యాసంస్థ డైరెక్టర్ కె.రూపారెడ్డి, ప్రిన్సిపాళ్లు కల్పవల్లి, సునీతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాగ్దానాలన్నింటినీ అమలు చేస్తాం

- మంత్రి శ్రీధర్‌బాబు



హస్తినాపురం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలు చేస్తామని, ఆరు గ్యారంటీ హామీల్లో రెండింటిని ఇప్పటికే అమలు పరిచామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హస్తినాపురానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యోగేశ్వర్‌రెడ్డి ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఎంతో నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారం అప్పగించారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి పరిపాలన అందిస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ప్రజలు సంబురాలు చేసుకుంటున్నారని చెప్పారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 23, బెండ 45, పచ్చి మిర్చి 28, కాకర 38, బీర 45, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 37, దొండ 35–40, చిక్కుడు 50, గోకర 45, బీట్‌రూట్ 33, క్యాప్సికం 55, ఆలు 23, దోస 23, సార 11, పొట్ల 15, ఉల్లిగడ్డ 38, చామగడ్డ 45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.